# దొంగ, దొర బుద్ధులు

వాస్తు రామచంద్ర

పాత రోజుల్లో బస్సు సౌకర్యాలు, రహదారులు కాని సరిగా వుండేవి కావు. గ్రామాల మధ్యన ప్రజలు నడిచే వెళ్ళేవారు. దొంగతనాలకు దోపిడీలకు అంతం ఉండేది కాదు. దొంగలు దోపిడీదారులు ముఠా లుగా ఏర్పడి గ్రామాలను దోచుకునేవారు. రక్షణ సిబ్బంది కరువైన కారణంగా రక్షణ కరువై వుండేది. సరిగా వర్షాలు పడనందున వర్షాధార పైర్లు సరిగాపండేవి కావు. పేదరికం తాండవిస్తోండేది. కావూరు గ్రామంలో దొంగతనం ద్వారా బ్రతుకు పోసుకునే వారే ఎక్కువ. వెట్టివారే గ్రామాలకు కాపలాదారులు. వాళ్ళే వేగులు. గ్రామపెద్దలు తీర్పరులు.

కరణం,మున్సిబ్‌లే గ్రామ పెత్తందారులు. మున్సిబ్‌గా గ్రామంలో భూస్వామిగా వుండే రెడ్డిగారో, కమ్మవారో వుండేవారు. లెక్కలు రాబట్టే బ్రాహ్మణులే ఎక్కువగా కరణాలుగా వుండేవారు. బ్రిటీషువారి హయంలో నీతి నియమాలకు తావుండేది. కనుక ఆస్తిగలవారికి మున్సిబ్ పదవి, డొక్కశుద్ధి వున్న పంతుళ్ళకి కరణీకం ఇచ్చేవారు.

గ్రామాలకు సంబంధించిన పొలాలు, గట్లు, రాళ్ళు ఎక్కడ వుండేది ఇంటిదగ్గరే చెప్పేవారు. మున్సిబ్ గౌరవ ప్రధానం కొరకు ఉద్యోగం చేసేవారు. కొందరు కరణాలు ట్రైనీ కలెక్టర్లకు శిక్షణ ఇచ్చేవారు. నేడంతా తారుమారై వీఆర్‌ఓల పేరిట ఉద్యోగాలు ఏర్పరచి ఓనమాలు రాని వారికి లంచగొండిలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. ఆత్మీయతతో చేసేపనికి కృతజ్ఞతగా కరణానికి గోంగూర కాడలు, పెరుగు, వంకాయలు, బెండకాయలు ఇచ్చేవారు. ఆ స్థితి నేడు మారింది.

వెంకటప్ప పంతులు చేవూరికి కరణం గారు. సుదర్శన్ రెడ్డి మున్సిబ్‌గారు. వీరిద్దరి అన్యోన్యత విడదీయరానిది. గ్రామ వ్యవహారాలు ఎన్ని రాజకీయ మలుపులు తిరిగినా సవ్యరీతిలో గ్రామాన్ని వుంచేవారు. వీరిరువురి అన్యోన్యత కారణంగా సుదర్శనరెడ్డి గారి వందలాది ఎకరములు పొలములు, సేద్య వ్యవహారాలు, లెక్కాపక్కా కరణం చూసేవారు. గ్రామంలోకి వచ్చే అధికారులకు సర్వ ఏర్పాట్లు చేసేవారు.

మున్సిబ్ గారు 'మోయినలు' కింద అయ్యవారికి బియ్యము, వగైరాలు ఏర్పాటుచేసేవారు. కరణం పంతులు బుర్ర ఉపయోగించి గ్రామ సమస్యలు, రాజకీయ కక్షలను లౌక్యంగా సరిచేసేవాడు.

హనుమంతరెడ్డి మున్సిబ్ వ్యతిరేక నాయకుడైనా ఆయనతోటి కరణం సయోధ్యగా వ్యవహారాలు నడిపేవాడు. వెంకటలక్ష్మి వెంక టప్ప పంతులు గారి భార్య. బాగా పాత తరమునకు చెందిన మనిషి. కల్లాకపటం తెలియని మనిషి. అతిథుల సత్కారాలతో ఇల్లు బంధుమిత్రాదులతో సందడిగా ఉండేది. వచ్చేవాళ్ళు వస్తుంటే, పొయ్యేవాళ్ళు పోతుంటే వడ్డనలతో సరిపోతుండేది.

నెలకు పుట్టెడు వడ్లు దంపకం జరగాలి. పదడుగుల దూరంలో రైసుమిల్లు వుంది. తలారి రమణయ్య వడ్ల దంపకంలోనూ, పాడి పశువుల పోషణలోనూ నిమగ్నమయ్యేవాడు. నల్ల పశువులు పది, తెల్లపశువులు మరో పది వుండేవి. వెంకటలక్ష్మి తల్లి అంటే ఆ ఊరిలో అన్నపూర్ణ తల్లితో సమానం. ఆది దంపతులుగా వారిద్దరికి ఊరిలో మంచి పేరు. గ్రామంలోనికి ఏ కొత్త వ్యక్తి వచ్చినా తలారులు మున్సిబ్ గారికో, కరణం గారికో తెలిపి వివరాలు అడిగేవారు.

ఒకరోజు కరణం మధ్యాహ్నం 12 గంటలకు పనిమీద మున్సిబ్ ఇంటికి వెళుతుంటే వీధి రచ్చమీద ఒక కొత్త వ్యక్తి కూర్చుని వున్నాడు. ఎవరబ్బాయ్... నీవు? ఏ ఊరిమీది? ఏ పనిమీద వచ్చావ్? అన్నాడు. అతను నా పేరు చెంచయ్య. నా స్నేహితుడు మంగయ్య దారిలో వున్నాడు. నేను ముందుగా వచ్చినాను. అతని కోసం ఎదురు చూస్తూ ఇక్కడ కూర్చున్నాను. గసపెడుతూ మాట్లాడుతున్నాడు. అలసటమీద వున్నాడు.

''వెదవా...? ఆ గసేమిటి? ఆ అలసటేమిటి? కూడు తిన్నావా?... లేదా! లోపలికి పోయి దాహం తీర్చుకో... పో...పో...'' అన్నాడు.

హటాల్తున లేచి లోపలికి పోయాడు. లక్ష్మమ్మా...అని పెద్దాయన కేకవేశాడు. కేక పిలుపుకే అన్నం సిద్ధం చేసి కాళ్ళు కడుక్కుని రమ్మంది. విస్తర్లో దండిగా అన్నం, మధ్యలో గుంతచేసి సాంబారు, పక్కనే గోంగూర పచ్చడి, అన్నంలో పాడి, పీటమీద కూర్చుని రెండు మూడు సార్లు మారు అడిగి పెరుగుతో శుష్టిగా భోజనం చేసి త్రేపులతో బయటకు వచ్చాడు.

పాత రోజుల్లో కుమ్మరి, మంగళి, చాకలులకు మాన్యాలు వుండేవి. వారి వారి విధుల్లో చక్కగా పనిచేసేవారు. మంగలి వెంకయ్య వాళ్ళ పూర్వీకులు, సుదర్శన్ రెడ్డి గారి పూర్వీకుల నుండి సకల శుభాలకు, అశుభాలకు వెంట నుండి కార్యక్రమం జరిపేవారు. మున్సిబ్ ద్వారా వెంకయ్య కరణం గారికి కూడా అవసరాలకి పలికేవాడు.

కుమ్మరి సాంబయ్యదీ అదే తీరు. వంట కుండలు, నీళ్ళ కుండలు, ముంతలు, వేసవి జగ్గులు, మూకుళ్ళు, దీపావళికి సంబంధించి శెమ్మెలు, పిడతలు తయారు చేసేవాడు.

చాకలి రోశమ్మ రెడ్డమ్మ రజనమ్మకి చాలా ముఖ్యం. సంసారంలో సమర్తకాడ నుండి శుభాశుభ కార్యక్రమము లకు ఆమె మొదటి వుండేది. రెడ్డి గారి దుస్తులు, రెడ్డెమ్మ పరివారపు దుస్తులు, చీరలు, వగైరాలు, ధవళకాంతు లతో ఉతికి రెడ్డెమ్మ మెప్పు పొంది కానుకలు తీసుకొనేది. అత్తలు, మామలు, మనవళ్ళు, కొడుకులు, కోడళ్ళు ఎందరి అభిమానాన్నో చూరగొంది. ఎందరి నుండో ఆదరణ పొందింది.

అక్కడా... ఇక్కడా తిరిగిన చెంచయ్య, మంగయ్యలు రాత్రి 8 గంటలకి ఊరి ముంగిళ్ళలో ఎవరికి కనబడ కుండా చాటున దాగారు. 8 గంటలకే గ్రామం సర్దుమణి గింది. ఆనాడు కరెంటు దీపాలు లేవు. వేకువనే లేచిన గ్రామం. నిద్ర ఒడిలోనికి పెందలాడే జారింది.

దొంగల జంట పెద్దింటికే కన్నం వేయాలని నిర్ణయం తీసు కున్నారు. జమీందారి కుటుంబం గనుక రెడ్డమ్మ సిబ్బంది వేరు వేరు బెడ్‌రూంలో పడుకున్నారు. హాలులో పనివారు పడుకున్నారు.

నాటుకుక్క రంగడు (నిక్‌నేమ్) ప్రహరీదగ్గర తిరుగుతోంది. దొంగలు గుట్టుగా కుక్కకు మత్తు చల్లారు. తిరిగే కుక్క నిద్రమత్తులోకి జారుకుంది. దొంగలు కన్నం వేయకుండానే ప్రహరీ దూకి పడమటి ఇంటి గొళ్ళెం కోసి లోనకు పోయారు.

ఏమాత్రం అలికిడి చేయకుండా బీరువా తీయడం వారికి వెన్నతో పెట్టిన విద్యేవెూ! చకచకా తీసి చంద్రహారాలు,పట్టెలు, వడ్డాణాలు, కాసులు మూట గట్టుకుని పక్క బీరువా తెరవగానే పట్టుచీరలు నిగనిగ మెరుస్తున్నాయి.

దొంగోడికి ఎంత దోచినా కరువే అన్నట్లు పాతిక చీరలు వేరే మూటగట్టి చెరొక మూట భుజంమీద వేసు కుని చడీచప్పుడు కాకుండా ప్రహరీ దాటి చీకట్లో కలిసి పోయారు. తెల్లారే రెడ్డిగారింట దోపిడి విన్న జనం గుమిగూడారు. రెడ్డిగారి సొమ్ము, చీరలు, నగలు పోవడం గ్రామస్తులందరిని కలిచివేసింది.

కరణం, కరణం గారి భార్య రెడ్డిగారింటికి పోయి వారిద్దరినీ ఓదార్చారు. కరణం రిపోర్టు తయారుచేసి నెల్లూరు పోలీసుస్టేషన్‌లో ఇవ్వా లనుకున్నాడు. సుదర్శన రెడ్డి, రజనమ్మలు ఒప్పుకోలేదు. గ్రామస్తులు, తమ తమ

ఇంట్లో దొంగతనం జరిగి నట్లుగా భావించారు.

చాకలి రోశమ్మ కావూరు దగ్గర వున్న బెల్లంపల్లిలో తన కూతురిని ఇచ్చింది. అమ్మిని, మనవడ్ని, మనవరాలిని చూసేందుకు మూడు, నాలుగునెలలకు ఒకసారి పోయి వస్తూ వుండేది.

వేకువనే బయలుదేరి చద్దిమూట కట్టుకుని తనతో లడ్డూ, అరిసెలు, బొంబాయి మిఠాయిలు తీసుకెళ్ళేది. ఆనాడు ఏ సౌకర్యం లేనందున నడిచి వెళ్ళేది. ఏటికాడ చద్దనం తినేది. ఉన్నట్టుండి ఉలిక్కిపడింది. యేటికాడ చాకిరేవు ఇతర గుడ్డలతో పాటు తళతళ మెరిసే పట్టు కోకలు కనపడ్డాయి. ఆడ, వారిని పిలిచి ఈ చీరలెక్కడివి.... మా రెడ్డమ్మవి... అరిచి ఆగం చేసింది.

అమ్మి కాడకు పోకుండా తిరుగు ప్రయాణం కట్టి నేరుగా అలసిపోతూ, ఆయాసపడుతూ రొప్పుతూ రజ నమ్మా... అంటూ కేకపెట్టింది.

పడకగదిలో వున్న రజనమ్మ ఏమే రోశమ్మా... అంటూ కేక వేశావు ఏమంటూ కేక వేసింది. మజ్జిగ తెప్పించి నోట్లో పోసింది. సతాయించుకున్న రోశమ్మ కావూరి యేటికాడ ఆరేసిన చీరలు, తమవేనంటూ మొరపెట్టుకుంది. రజ నమ్మ కరణాన్ని పిలిపించి రెడ్డిగారికి విషయం తెలిపింది. పాలేర్లు, వెట్టివారు, గ్రామప్రజలు గుమికూడి అందరూ కావూరు వైపు కాలినడకన సాగారు. కరణం కూడా ఓపిక చేసుకుని బయలుదేరాడు.

కావూరు కరణం ఇంటికి వెళ్ళాడు. పెద్ద కరణం వచ్చి నందులకు రఘురామయ్య సంబరపడిపోయాడు. వున్న విషయం చెప్పాడు పెద్ద కరణం. మంతనాలు చేశాడు. ఈ పని తప్పకుండా చెంచయ్య, మంగయ్యలదే అయి వుంటుందని నిర్ధారణకు వచ్చారు.

చేవూరు గ్రామస్తులు ఊగిపోతున్నారు. ఆ... నా... కొడుకులు ఎక్కడా అంటూ చంపేస్తామన్నారు. ఆ పని సుదర్శనరెడ్డి గారు చూసుకుంటారులే... ఊరకుండండి అని కరణం, వారి ఉద్రేకాన్ని తగ్గించారు. ఆ ఊరు వెట్టి వారు ఆ ఇద్దరిని తాళ్ళతో కట్టి, పాడి కట్టినట్లు కర్రలమీద కట్టి మోసుకుంటూ సుదర్శనరెడ్డి గారింట తోశారు. రెడ్డి గారు ప్రశాంతంగా వున్నాడు. కట్లు విప్పమన్నారు. అప్పటికే వారు సగం చచ్చారు. ఏరా... చెప్పండని కరణం అరిచారు.

చెంచయ్య ఇట్లు చెప్పసాగాడు. ''బుద్ధి గడ్డితిని ఈ దొంగతనం చేశాము. మమ్మల్ని చంపకండి. నేను మొద టిగా ఊర్లో ప్రవేశించాను. కరణం అయ్యగారి అరుగుమీద కూర్చున్నాను.అయ్యవారు నన్ను మొదట అనుమానించినా నా బెట్టముఖాన్ని చూసి లోపలికి పోయి భోజనం చేయ మన్నాడు. ఆకలితో అలమటిస్తున్న నన్ను కరణం భార్య అప్యాయతగా పిలిచి నీళ్ళు ఇచ్చి విస్తరాకు వేసి పెరు గన్నంతో కమ్మని భోజనం వడ్డించింది.

పొద్దుబోయిన తరువాత వాళ్ళింట్లో దొంగిలించాలని తలుపు తీయబోయాను. మనసు కలతపడింది. అన్న పూర్ణమ్మ తల్లి ఆదరించి కడుపారా బువ్వపెట్టింది. ఈ ఇంటిలో దొంగతనం చేస్తే తల్లిని మానభంగం చేసిన పాపం చుట్టుకుంటుందని ఇల్లు దాటి పక్కనే వున్న మంగ య్యతో కలిసి సుదర్శనరెడ్డి గారింట కుక్కకు మత్తుకొట్టి ప్రహరీదాటి దొంగతనం చేశాము.

సొమ్ముతో తృప్తిపడక 25 చీరలు దొంగతనం చేసి చెరొక మూట వీపున వేసుకుని, చీకట్లో కలిసిపోయి మా వూరు చేరాం.ఆ చీరలని మామూలుగా కొనే వెంగయ్యకు అమ్మివేశాం. రోశమ్మ యేట్లో ఆరేసుండే చీరలను తమ రెడ్డిగారమ్మవని నిర్ధారణతో చెప్పబట్టి ఊరివారితో తన్నులు తిని మీకాడపడ్డాము. మన్నించండి రెడ్డి గారూ...'' అని రెడ్డిగారి కాళ్ళమీద పడ్డారు.

రెడ్డిగారు దయార్ద్ర హృదయులు కాబట్టి తన పొలం లోని ఐదెకరాలను చెరి రెండున్నర ఎకరాల వంతున కరణంచే వ్రాయించి దొంగతనాలు చేయకుండా బతక మన్నాడు.రెడ్డి తీర్పుకు ప్రజలు సంతసించారు. యావత్తు సొమ్ము, చీరలు వెంగయ్య మూటలు కట్టి రెడ్డిగారి వద్దకు వచ్చి చేతులు కట్టుకున్నాడు. ఇటువంటి దొంగ వ్యాపా రం చేస్తే తన్ని తరుముతారని హెచ్చరించి పంపాడు.

అందరూ పంతులమ్మ ఔదార్యాన్ని చాకలి రోశమ్మ తెలివితేటలకు ముగ్ధులయ్యారు. రజనమ్మ రోశమ్మకు చంద్రహారం, వజ్రపుటుంగరం బహుమానంగా ఇచ్చింది. తరాలు గడిచినా సుదర్శన రెడ్డి,సుజనమ్మ దంపతుల ఉన్న తిని, వెంకటప్పయ్య పంతులు, వెంకటలక్ష్మిల అన్న దాన రీతిని అనుకోవడమే కాకుండా రోశమ్మ నిశిత పరిశీలనను, యాజమాన్యము మీద నమ్మకాన్ని అందరూ నేటికి కథలు, కథలుగా చెప్పుకుంటారు.

ఇది సత్యము. ముమ్మాటికి సత్యం.■

## అండదండ

**ఈ** అనాధ చేతి తాపె పనితనం
ఆ సుందర భవన కళాఖండం
నేడు దాని నీడే-
నాకూ నా కుటుంబానికి
ఎండపడకుండా కాపాడే
అండదండ-జీవిత జండా

## శిలకు శిక్ష

**జా**తిపితపై
మరణానంతర కక్ష
రహదారి కూడళ్ళలో
ఆయన శిలకు శిక్ష
గాలి, వాన, ఎండకు లేదు రక్ష
ఆ బోసినవ్వులో
తెలియని అర్థాలు లక్ష

## మధురం

**ప**సి మొగ్గలకన్నా
వసివాడిన పూలకన్నా
విరిసి విరియని విరులు
కసుగాయలకన్నా
పండిపోయిన పండ్లకన్నా
పండీ పండని దోరలు
మధురాతి మధురం

## ఎండమావులు

**స**హృదయుడి కవితాత్మ
కవితాత్ముని సహృదయం
కనిపించని ఎండమావులు
కనిపించు బ్రతుకరతా

## కళాకారుడు

**వం**చకుడు నెంబర్‌వన్
కళాకారుడు
అతని కళానైపుణ్యాతకు
గుర్తింపు, సన్మానాలు
లేవనే వ్యధ
ఎవరికి చెప్పుకొన్నా
పాపం-వినేవాడే
సీనియారిటీలో ఫస్టు

## ముడిసరుకు

**వి**ద్యాలయ
యంత్ర ఖార్కానాల్లో
ఏటేట, ప్రతియేట
నిరంతరాయంగా
తయారయ్యే ముడిసరుకు
నిరుద్యోగ యువత

*సింగార సుబ్బరాయుడు*